# ఈ తరం ప్రేమకథ

రచన :
శ్రీ ఎ. ఎమ్. అయోధ్యారెడ్డి.

(గత సంచిక తరువాయి)

వారం రోజులు గడిచిపోయాయ్.

ఎనిమిదవ రోజు వాణి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది రవికి.

నా అభిమాన రచయిత గారికి—

నమస్కారములు! క్షేమంగా వున్నారని తలుస్తాను.

ఆ రోజు ఇంటికి చేరిన తర్వాత ఎంత ఆలోచించినా మీరాలోచించుకోమన్న దేమిటో నాకర్థం కాలేదు.

ఎంతమందిలోనైనా నా మనసులోని ఉద్దేశ్యాన్ని ఘంటాపథంగా వ్యక్తీకరించే స్వభావం గల్గిన నాకు, ఆ రోజు మీముందు గొంతు విడివడకపోవడం చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది.

అయినా నా మనసులోని భావమేమిటో మీరు గ్రహించి కొండంత బరువును దించేశారు కృతజ్ఞతలు.

ఏం చేస్తున్నారు మీరిప్పుడు? ఏమైనా రాస్తున్నారా? నన్నూహించుకుని ఓ ప్రేమ కథ రాయండి బాగా వస్తుంది!

ఇక వుంటాను మరి! తిరుగు జాబు రాస్తారని ఆశిస్తూ,

మీ—"వాణి"

లెటర్ చదవటం పూర్తి చేసిన రవి వదనంలో చిరుదరహాస మొకటి ఉదయించింది. వెంటనే కాగితం, కలం తీసుకుని వాణికి ఇలా రాశాడు.

ఇంద్రజాలిక శిఖామణి వాణికి—

ఏమిటీ సంబోధన అని ఆశ్చర్యపోతున్నావా? అవును నా కళ్ళకి నువ్వో ఇంద్ర జాలికురాలిగానే కన్పిస్తున్నావు అబ్బ! ఎన్ని వేషాలు వేశావు? ఎంత కథ నడిపావూ నిజంగా!!

ఒకసారి పల్లెటూరు చిలకమ్మలా, మరోసారి పట్నవాసపు వన్నెచిన్నెల విసనకర్రలా ఏమిటీ రంగుల మార్పులు?

సరె! నిన్నూహించుకుని ప్రేమ కథ రాస్తాను, అది నీకే అంకితం సుమా! ఉత్తరంలో ఇంకా ఏమో రాయాలనుకున్న రాయలేకపోయినట్లున్నావ్! ఈసారి అదేమిటో దాపరికం లేకుండా వ్రాయి.

వుంటాను నీ
"రవి."

రవీ—

మీ ఉత్తరం చేరింది, నామనసుమీద అమృతపు జల్లు కురిసినట్టయింది. ప్రభుత్వ లాటరీలో మొదటి బహుమతి ఐదు లక్షలు వచ్చినంత ఆనందంతో... అబ్బే! మరీ ఘోరంగా వుంది ఉపమానం. ఖర్మ నేను రచయిత్రినో, కవయిత్రినో అయితే ఎంచక్కా మనోహరంగా వర్ణనలు చేసేద్దును.

మీరు సైకాలజీ చదవకపోయినా, మానసిక పరిశీలనా దృష్టి చాలా వుందని చెప్పవచ్చు. నేనేమో చెప్పాలనుకొని చెప్పలేకపోయింది నిజం.

రోజూ కాలేజీకి వెళుతూ నేవున్నా, మునుపటిలా ఫ్రీగా, చిలిపిగా వుండలేకపోతున్నా, అనుక్షణం మీరు జ్ఞాపకం వస్తున్నారు, పుస్తకం తెరిచినా, మూసినా అలా నుదుటిమీదకు జారిపడుతున్న జుత్తుతో అందమైన మీ ముఖమే కన్పిస్తోంది.

ఇంకా మీ నవ్వు...! ఏ పని చేస్తూన్నా వెంటబడి తరుముతూ గిలిగింతలు పెడుతోంది. అబ్బ! నవ్వుతున్నారా? అలా నవ్వకండి బాబూ! అలా అయితే నేనిక రాయలేను మరి!

ఇప్పటికే నా స్నేహితురాళ్ళు గుర్తించారీ విషయం, మీరే ప్రఖ్యాత రచయిత 'నవీన్' గారని మావాళ్ళకింకా చెప్పలేదు.

చెబితే ఆశ్చర్యంతో నోళ్ళు తెరిచేస్తారు. వెంటనే మీదగ్గరకు పరిగెత్తుకొచ్చేస్తారు. అక్కయ్యకు కూడా చెప్పాను నా మనసులోని కోరిక.

రవీ! నిజంగా మీలో ఏదో వుంది. అది నన్ను నన్నుగా కాకుండా మరోలా మార్చివేసింది, ప్రేమంటే ఏమిటో నాకు తెలియదు. మీకోసం నా హృదయం ప్రతి క్షణం స్పందించడమే ప్రేమ అనబడితే నేను మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాననుకోవచ్చు.

జీవితంలో నేనొకర్ని ప్రేమిస్తాననీ, అటువంటి

ఏం...
కుటుంబానికి కావలసినవాటిని ఎన్నుకోండి!!
- టెక్స్ టామ్ -
* బనియన్లు. * డ్రాయర్లు.
* చెడ్డీలు. * కట్ బాడీలు.
తయారించువారు :—
టామ్‌టెక్స్ నిట్టర్స్, తిరుపూరు-638602
TEX TOM BANIANS
Trade Mark

పరిస్థితి ఒక సారి వస్తుందనీ నేనెప్పుడూ అనుకోలేదు. అసలు ప్రేమలోనే నాకు నమ్మకముండేది కాదు.

కాని మిమ్మల్ని చూశాక నా మనసు ఏదో అయింది. అది మీ వైపుకే లాక్కుపోవడం మొదలెట్టింది. మరిప్పుడేం చెయ్యాలి నేను?

దీని పర్యవసాన మేమిటో? మంచి తప్ప మరొకటి కాకూడదు, అలా అయితే...? దయచేసి నాకు ఆశాభంగం కల్గించవద్దు.

మీ ఎదలో చోటు కోరే,
"వాణి."

ఈ ఉత్తరం వచ్చాక రవి కొంచెం దీర్ఘంగా ఆలోచించాడు, సాయంత్రం రాజుతో కల్సి పొలాల వెంబడి షికారుగా వెళ్ళినప్పుడీ ప్రస్తావన చెప్పి ఉత్తరం చూపించి చదవమన్నాడు.

ఆ లెటర్ ఆమూలాగ్రంగా చదివిన రాజు తేలిగ్గా నవ్వేశాడు.

"ఒరేయ్ రవీ! నువ్వంటె ఆ అమ్మాయికి ఎంత ఇష్టమో నేను మొదటి చూపుతోనే గ్రహించాను. ఆరోజు పెళ్ళి చూపుల సమయంలో వాణి నీ వైపు చూసేచూపుల్లో ఎంత ఆరాటన వుందో నేనప్పుడే గమనించాను. మరు మాట్లాడకుండా ఆ పిల్లతో పెళ్ళికి వప్పేసుకో మళ్ళీ అడ్డు ప్రశ్నలు వేసి తప్పించుకో జూడకు నాకు కోపం వస్తుంది" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

"అది సరేరా! ఆ అమ్మాయి సిటీ తాలూకు, పైగా ఫైనలియర్ బి.యస్సి. చదువుతోంది, నేనా వ్యవసాయం వెలగబెడుతున్నాను, మరి మా కాంబినేషన్ ఎలా వుంటుందంటావ్?" అనుమానంగా అడిగాడు రవి.

రాజు తేలిగ్గా తేల్చి పారేశాడు ఈ సమస్యను. "వ్యవసాయం అంటె నామోషి పడాల్సిన అవసరం లేదురా రవీ! నువ్వూ చదివితె యం.బి.బి.యస్. కాలేక పోయ్యేవాడివా? పరిస్థితులు అడ్డొచ్చాయిగాని, అయినా ఇప్పుడు నీకేం తక్కువరా? అందం తక్కువా? ఆస్థి తక్కువా? మంచి క్రికెట్ ప్లేయర్‌వి, ఇంకా మహా రచయితవి...! పైగా హాలివుడ్ హీరోలను తలదన్నె పర్సనాలిటి..."

"ఇంక చాల్లేవోయ్ ఆపు! భట్రాజులా వెధవ పొగడ్తలు" మధ్యలోనే కసురుకున్నాడు రవి. "నాకైతే పెళ్ళి ఇప్పుడప్పుడే చేసుకోవాలని లేదురా!"

"బాగాలేదని కాదు, చాలా బాగుంది, నామనసుకు నచ్చింది కూడా"

"మరెందుకోయ్!"

"ఏమో! కారణం సరిగ్గా చెప్పలేను"

"ఒరేయ్! అట్టే పిచ్చి వేషాలెయ్యకు! తనంత తానుగా వలచివచ్చిన అమ్మాయిని కాదనకూడదు తెల్సిందా? వాణి నీకు అన్ని విధాలా తగిన భార్య

అని నా అభిప్రాయం. కాదంటావా రాధక్కకిప్పుడే ప్రత్యుత్తరం రాస్తాను"

"ఒరేయ్! అంతపనిమాత్రం చెయ్యకు, నీకు పుణ్యముంటుంది, ఇప్పటికే అక్కకు నామీద చాలా కోపంగా వుంది"

"కోపమా? ఎందుకురా?"

"అదె! పెళ్ళికి వప్పుకోవడంలేదని"

రాజు అతని బుజంతట్టి ఆప్యాయంగా అన్నాడు "చూడురా రవీ! నా మాటమీద నీకు గౌరవం వుంటె వాణిని భార్యగా స్వీకరించు"

నీ మాటమ్మీద నాకు గౌరవం లేకపోవడమేమిట్రా! నువ్వు ఏది చెయ్యమంటె అది చేస్తాను——కాని..."

మళ్ళీ కానీ ఏమిట్రా అడ్డంగా...!"

"వాణి ఈ పల్లెటూరులో ఇమడ గల్గుతుందాని?"

రాజు నవ్వేశాడు రవి మనసులోని అనుమానికి.

"అలా అనుకోవద్దురా రవీ! ఆ పిల్ల స్వభావం అలాంటిది కాదేమో నని తోస్తుంది, మొత్తానికి నీకు తగిన జోడీ, ఇంతకాలం నేను తలపోస్తూ వుందే వాణిరా!"

"ఏమనీ!"

"నీకు భార్య కాబోయె అమ్మాయి ఎలా వుంటుందో నని. నీదసలే సున్నిత హృదయంరా, ఎన్నో ఉత్తమ గుణాలున్న నీకు అలాంటి స్త్రీయెవస్తె బాగుంటుందను కున్నేవాణ్ణి, నాకిప్పుడు వాణిని చూశాక ఎంతో సంతృప్తిగా వుందిరా! అచ్చు నీ కథల్లోని నాయికలా వుంది. కాదంటావా?" నన్నాడు రాజు ఈ ఆఖరు మాట అంటున్నప్పుడు.

"నీ మొహం, పద పోదాం!" రవి చిరునవ్వుతో లేచాడు.

రాజూ, రవీ, వెనుదిరిగి ఇంటి ముఖం పట్టారు.

రవి ఇంటికి చేరుకోగానే వాణికి ఉత్తరం రాశాడు.

డియర్ వాణీ_

నేనిప్పుడో దృఢ నిశ్చయానికి వచ్చి నీకీ ఉత్తరం రాస్తున్నాను. నువ్వంటె ఇష్టం మొదట్నించీ వుంది నాకు. నిన్ను జీవిత భాగస్వామినిగా స్వీకరించాలనే కోరిక నా అంతరంగంలో అంతర్లీనమైవుంది, కాని ఏ పని చేసినను, ముందువెనుక ఆలోచించి చేయడం నా స్వభావం.

నేను నిన్ను స్వీకరిస్తాను వాణీ! నువ్వు నా హృదయ దేవతవు, ఇది వర్ణన కాదు నిజం, ఈ విషయం అమ్మతో ఈ రాత్రికే చెబుతాను. ఆమె నా మాట కాదనదు, వెంటనే వొప్పుకొంటుంది, ఈ రోజే మా రాధక్కకు కూడా రాస్తున్నాను.

కానీ, డియర్! ఒక్కమాట, నేను పల్లెటూళ్ళో నిత్యం పొలాల్లో తిరుగుతాను. పశువులతో మసులుతాను, వాటితోనే ఆడతాను——పాడతాను వాటిల్లో ఒకడిగా వుండిపోతాను.

మరి నువ్వు నాతో వుండగలవా? బాగా ఆలోచించుకో! ఒకవేళ నీ నిర్ణయం మార్చుకొన్నా సంకోచించక నాకు వ్రాయి.

మీ తండ్రిగారితో వివరంగా చెప్పి, ఆయన అభీష్టం మేరకు చెయ్యి, వుంటాను.

నీవాడు "రవి."

రవినుంచి ఉత్తరం అందుకొని చదువుతున్న వాణి హృదయంలో వేయి వీణలు మ్రోగాయ్. రవి తనవాడు కావడాన్ని వొప్పుకొన్నాడనే నిజం ఆమెను ఏవో లోకాల్లో విహరింపజేసింది, లోకమంతా పచ్చగా, అందంగా, ఆనందంగా గోచరించిందామెకు.

ఈ విషయం అక్క సరోజకు చెప్పి లెటర్ చూపించిందామెకు.

"అవును నిజమే వాణీ! నువ్వతనితో పల్లెటూళ్ళో కాపురం చెయ్యగలవా?" అంది సరోజ ఉత్తరం చదివాక.

వాణి గంభీరంగా, దృఢంగా చెప్పింది జవాబు "పల్లెటూళ్ళో కాదక్కా ఆయన తోడుంటే అడవిలో చెట్టుక్రింద వుండమంటేను వుంటాను. నా నిర్ణయం ఎప్పటికీ మారదు."

ఈ విషయం విని రాజశేఖరంగారు సంతోషంగా వొప్పుకున్నారు. "బాగుంది! రెండు వివాహాలూ ఒకేసారి చేసెయ్యొచ్చు" సంతృప్తిగా అంటూ నిట్టూర్చాడాయన.

(సశేషం)